### ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాలను
## వారంలోపు పూర్తి చేయాలి
**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, ఫిబ్రవరి 27 : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరిగే పనుల లక్ష్యాలను వారం లోపు పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం ఉదయం వారితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లేబర్‌ను మొబిలైజ్ చేయడం, ఉపాధి కల్పించడం, గ్రామానికి, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో బిల్డింగ్‌ల ఎఫ్‌టీవోను జనరేట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలను గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షా సెంటర్లను విజిట్ చేయాలని వారిని కలెక్టర్ ఆదేశించారు. అన్ని సౌకర్యాలు చెక్ చేసుకోవాలని, ప్రతి రోజూ పరీక్ష జరిగే సమయంలో సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేయాలని సూచించారు. ఎలాంటి కాపీ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ జిల్లాలో హోర్డింగ్స్, ఫ్లెక్సిలను 24 గంటల్లో తొలగించాలని, ఎన్నికల నియమాలను పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ
**లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు**



వికారాబాద్, ఫిబ్రవరి 27 : గ్రామీణ మహిళలకు కాస్ట్యూమ్స్, ఇమిటేషన్, వన్ గ్రామ్ జువెలరీ తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ (ముచ్చింతల్) సంయుక్తంగా ఫిబ్రవరి 28 నుంచి 13 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణపై ఆసక్తిగల మహిళలు 19 నుంచి 45 సంవత్సరాల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణా సమయంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాంతో పాటు టూల్ కిట్స్ కూడా ఇస్తారని వివరించారు. శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జీఎస్ఆర్ కృష్ణ, డైరెక్టర్, యూనియన్ బ్యాంక్, స్వర్ణ భారత్ ట్రస్ట్, ముచ్చింతల్, రంగారెడ్డి జిల్లాలో సంప్రదించవచ్చని తెలిపారు. ఏదేని సమాచారం నిమిత్తం 9391487797, 9177141712, 6301890681, 9618534720లను సంప్రదించవచ్చని సూచించారు.



### బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం
## నేడు తేలనున్న బలపరీక్ష

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై బలపరీక్ష నేడు బుధవారం జరుగనున్నది. ఆయనపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. డీసీవో అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సహకార సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధిలో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో సంఘం చైర్మన్‌గా లెక్కల విఠల్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా నార్లకొండ మల్లమ్మ బీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. పాలకవర్గం ఏర్పాటై నాలుగేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. 13 మంది డైరెక్టర్లకుగాను 9 మంది డైరెక్టర్లు చైర్మన్‌పై వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. 13 మంది డైరెక్టర్లలో ఇటీవలే అనారోగ్యంతో ఒక డైరెక్టర్ మృతి చెందగా 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. పార్టీలకు అతీతంగా చైర్మన్ విఠల్‌రెడ్డి ఒంటెద్దు పోకడలను భరించలేక సొంత పార్టీ డైరెక్టర్లు సైతం అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేశారని సమాచారం.

### పదో తరగతి పరీక్షల నిర్వహణలో
## పొరపాట్లకు తావివ్వొద్దు
**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, ఫిబ్రవరి 27 : జిల్లాలో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యత వహించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో విద్యా శాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉంటాయన్నారు. పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులెవరిని కూడా పరీక్ష హాల్‌లోకి అనుమతించరాదని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో రేణుకాదేవి, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.




శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణికుమార్, అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సరిత

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
**డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణికుమార్**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 : ఇబ్రహీంపట్నం డివిజన్‌లో మార్చి 3 నుంచి 5 వరకు జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ధరణికుమార్, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధరణికుమార్ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఎనిమిది పీహెచ్‌సీలు, ఒక పీపీయూనిట్ ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 0–5 ఏండ్ల లోపు పిల్లలు 63,204 మంది ఉన్నారన్నారు. పిల్లలందరికీ పల్స్ పోలియోకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డివిజన్ పరిధిలో 286 బూత్‌లు ఏర్పాటు చేశామని, 1144 మంది పోలియో చుక్కలు వేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతోపాటు ఆదిబట్ల, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో కూడా చుక్కల మందు వేయడానికి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు సరిత, సురేశ్, రఘు, మోహన్‌నాయక్ ఉన్నారు.

## పల్లెల్లో అప్రకటిత కరెంట్ కోత

తాండూరు రూరల్, ఫిబ్రవరి 27 : మంగళవారం తాండూరు మండలంలో సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ కోత విధించారు. 220 కేవీ సబ్‌స్టేషన్‌లో సమస్య తలెత్తిందనే సాకుతో సోమవారం మండలంలోని గౌతాపూర్, కరణ్‌కోట, కోటబాసుపల్లి గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలన్నీ చీకట్లో మగ్గాల్సి వచ్చింది. గతంలో బీఆర్ఎస్ పాలనలో అరగంట కరెంట్ కోత ఉండేదికాదని ప్రజలు చర్చించుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్రకటిత విద్యుత్ సమస్య తలెత్తుతున్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా విద్యుత్ సమస్య లేదని సీఎం ప్రకటిస్తుండగా.. మరో పక్క విద్యుత్ సమస్యతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం చేసే అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పనులు నాణ్యతగా చేపట్టాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- పరిగి, బొంరాస్‌పేట మండలాల్లో సీసీ రోడ్ల పనుల పరిశీలన



బొంరాస్‌పేట : మెట్లకుంటలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 27 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మెట్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని.. రోడ్లకు వాటర్ క్యూరింగ్ చేయించాలన్నారు. గ్రామంలో పల్లె ప్రకృతివనం, సీసీ రోడ్ల నిర్మాణం బాగుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీరాములు, ఏఈ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

### నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేయాలి

పరిగి : నిర్దేశించిన సమయంలోగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. పరిగి మండలం రంగంపల్లి గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని పేర్కొన్నారు. రంగంపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టడంతో కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉమేశ్, డీఈ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొడంగల్ మార్కెట్‌ను వృద్ధిలోకి తీసుకొద్దాం
**జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి**

కొడంగల్, ఫిబ్రవరి 27 : మార్కెట్ యార్డ్‌ను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కలిసి రావాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి వ్యాపారస్తులను కోరారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో వ్యాపారులతోపాటు రైస్‌మిల్లర్లతో మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొడంగల్ మార్కెట్ యార్డ్‌లో వ్యాపారాలు కొనసాగించేలా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో వ్యాపారాలు కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై వారితో చర్చించారు. ఇదివరకే మార్కెట్ యార్డ్ అవరణలోని వ్యాపార సముదాయ దుకాణాలను కూడా వేలం వేసినట్లు తెలిపారు. అదేవిధంగా వ్యాపారులు, రైస్‌మిల్లర్లు అందించిన సలహాలు, సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, సెక్రెటరీ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ దేవదత్తు, మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

# ఉపాధ్యాయుల భర్తీతో నాణ్యమైన విద్య

- ప్రాథమికోన్నత పాఠశాలలను పీడిస్తున్న టీచర్ల కొరత
- సత్యదూరంగా నాణ్యమైన విద్య.. నష్టపోతున్న విద్యార్థులు
- కొత్త పోస్టులు మంజూరు చేసి వచ్చే డీఎస్సీలో భర్తీ చేయాలంటున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 27 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలు సత్యదూరంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు తదితర అనేక రకాలైన కార్యక్రమాలను అమలు చేస్తున్నది. కానీ పాఠశాలల్లో సరిపోను ఉపాధ్యాయులు లేక ఇటువంటి కార్యక్రమాల అమలు ప్రశ్నార్థకంగా మారింది. బొంరాస్‌పేట మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య పట్టి పీడిస్తున్నది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన వారి కంటే తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం యూపీఎస్‌లుగా అప్‌గ్రేడ్ చేసింది కానీ వాటికి కొత్తగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయడం మరిచిపోయింది. దీంతో యూపీఎస్‌లలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు బాట పట్టిస్తున్నారు. ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వం త్వరలో కొత్త డీఎస్సీని ప్రకటించనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం బొంరాస్‌పేట మండలంలోని యూపీఎస్‌లకు కొత్తగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి భర్తీచేస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.




సింగిల్ టీచర్‌తో కొనసాగుతున్న సాలిండాపూర్ యూపీఎస్



ఒకే టీచర్ ఉన్న మదన్‌పల్లి యూపీఎస్

### 15 యూపీఎస్‌లు, 38 మంది టీచర్లు

బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 15 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 268 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒక యూపీఎస్‌లో ముగ్గురు ఎస్జీటీలు, ఒక స్కూల్ అసిస్టెంట్ గణితం లేదా సైన్స్, ఒక బాషా పండితుడు తెలుగు లేదా హిందీ కలిపి మొత్తం ఐదుగురు టీచర్లు ఉండాలి. కానీ మండలంలోని ఏ ఒక్క యూపీఎస్‌లో కూడా ఐదు మంది టీచర్లు లేదు. పండిత్‌లు, ఎస్ఏలు ఏ పాఠశాలలోనూ లేరు. నిబంధనల ప్రకారం 15 యూపీఎస్‌లలో ఐదు మంది టీచర్ల చొప్పున 75 మంది టీచర్లుండాలి. కానీ 47 పోస్టులు మంజూరు ఉంటే అందులోనూ 38 మందే పని చేస్తున్నారు. వీటిలోనూ 9 ఖాళీలు ఉన్నాయి. బొంరాస్‌పేట మండలంలోని కొత్తూరు యూపీఎస్‌లో మూడు పోస్టులకుగాను ఇద్దరు, వడిచెర్లలో మూడింటికి ముగ్గురు, ఎనికేపల్లిలో మూడింటికి ఇద్దరు, మహంతీపూర్‌లో రెండు పోస్టులకు ఇద్దరు, సాలిండాపూర్‌లో రెండింటికి ఒకరు, మదన్‌పల్లిలో ఒక పోస్టుకు ఒకరు, బురాన్‌పూర్‌లో మూడింటికి ముగ్గురు, నాందార్‌పూర్‌లో నాలుగు పోస్టులకు నలుగురు, ఏర్పుమళ్లలో ఐదింటికి నలుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. దుద్యాల మండలంలోని ఈర్లపల్లి యూపీఎస్‌లో మూడింటికి ముగ్గురు, గౌరారంలో మూడింటికి ఇద్దరు, లగచెర్లలో మూడింటికి ఇద్దరు, దుద్యాల ఉర్దూ మీడియంలో నాలుగు పోస్టులకు ఇద్దరు, అల్లికాన్‌పల్లిలో మూడింటికి ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. ఒక్క చిల్‌ముల్‌మైలారం యూపీఎస్‌లో మాత్రం ఐదు పోస్టులు మంజూరు ఉండగా ఐదుమంది టీచర్లు పని చేస్తున్నారు.

### యూపీఎస్‌లకు పోస్టులు మంజూరు చేయాలి




మండలంలోని యూపీఎస్‌లకు చాలా ఏండ్ల నుంచి కొత్తగా పోస్టులు మంజూరు కాలేదు. పీఎస్‌లను యూపీఎస్‌లుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది కానీ పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు. దీంతో యూపీఎస్‌లలో చదువుకునే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. టీచర్ల కొరత కారణంగా విద్యార్థులు కూడా యూపీఎస్‌లలో చేరడంలేదు. ప్రభుత్వం ఇప్పడైనా యూపీఎస్‌లకు కొత్త పోస్టులను మంజూరు చేసి వాటన్నింటినీ డీఎస్సీతో భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

– బాకారం చంద్రశేఖర్, తపస్ మండల అధ్యక్షుడు

# రాజీతోనే కేసుల పరిష్కారం

**మార్చి 9న నేషనల్ లోక్ అదాలత్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్

వికారాబాద్, ఫిబ్రవరి 27 : మార్చి 9న జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, మోటార్ ఆక్సిడెంట్ నష్ట పరిహారం కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ అన్నారు. మంగళవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, వికారాబాద్ న్యాయవాదులతో, బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద బీమా కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం కోసం ఇన్సూరెన్స్ కంపెనీ ప్యానల్ న్యాయవాదులు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు రాజీ మార్గంలో సెటిల్ అయ్యేలా చూడాలని తెలిపారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయితే కట్టిన కోర్టు ఫీజు తిరిగి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. బ్యాంకు అధికారులు కూడా వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు మార్చి 9న జరుగబోయే నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని న్యాయవాదులు, బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.బీ.శీతల్, వికారాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన న్యాయవాదులు, బ్యాంకు అధికారులు

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

బొల్లారం, ఫిబ్రవరి 27 : జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో రెండో రోజు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంకేతికత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా నగరంలో వివిధ పాఠశాలలకు,కళాశాలలకు చెందిన సుమారు 2000 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలను వీక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయం అధికారులు,విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంకేతిక ప్రదర్శనలు





## కొత్త విషయాలను నేర్చుకోండి
**స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణలో ఎస్పీ కోటిరెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 27 : ఏఆర్ ఎస్సీటీపీసీ (స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లు)లు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏఆర్ ఎస్సీటీపీసీఎస్‌ల 9 నెలల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 బ్యాచ్‌కు చెందిన ఆసిఫాబాద్ నుంచి 55, రామగుండం నుంచి 109, సిద్దిపేట నుంచి 60 మొత్తం 224 మంది ఏఆర్ ఎస్సీటీపీసీ అభ్యర్థులు శిక్షణ కోసం జిల్లాకు వచ్చారన్నారు. లక్షల మంది కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తే, అందులో కొందరికే అవకాశం వస్తుందన్నారు. ట్రైనింగ్‌లో ఉన్న వారు క్రమశిక్షణను పాటించాలన్నారు. ట్రైనింగ్ సమయంలో ఇండోర్, అవుట్ డోర్ ట్రైనింగ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాక్‌లో మార్పులను గమనించాలి
**న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్**

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 27: విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో న్యాక్ పాత్ర ఎంతో ఉంటుందని న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ అన్నారు. న్యాక్ గుర్తింపులో వస్తున్న మార్పులను అధ్యాపకులు గమనించాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా న్యాక్ గుర్తింపుపై రెండు రోజుల జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఓయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వీఎస్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్పులకు అనుగుణంగా మెరుగు కావాల్సిన విభాగాలపై దృష్టిసారించాలని సూచించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ.. తెలంగాణలో సగటున 2.25 నుంచి 2.5 లక్షల మంది విద్యార్థులు యూజీ కోర్సులను అభ్యసిస్తున్నారన్నారు. వారిలో 25 వేల మంది మాత్రమే ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల్లో సంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరుతున్నారన్నారు. సాంప్రదాయ పీజీ కోర్సుల్లో చేరే 76 శాతం మంది మహిళా విద్యార్థినుల అవసరాలు తీర్చేందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ శిరీష, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జి. మల్లేశం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. విజయభాస్కర్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, హెడ్‌లు, డీన్‌లు, అనుబంధ కళాశాలల ప్రతినిధులు హాజరయ్యారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ. వీఎస్ ప్రసాద్